క్లుప్తంగా

కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా వెంకటేశ్వరచారి



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గుమ్మునూరు ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆరేంద్ర వెంకటేశ్వరచారిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి మంగళవారం తెలిపాడు.

ఎమ్మెల్యే అభ్యర్థి కారు తనిఖీ



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ వాహనాన్ని రూరల్ పీఎస్ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులో రూరల్ ఎస్సై బి.రాంచరణ్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. మురళీనాయక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జమాండ్లపల్లి గ్రామం మీదుగా వెళ్తున్నాడు.

రేవంత్‌రెడ్డిని కలిసిన 'జాగో ముసల్మాన్ కమిటీ'



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో 'జాగో ముసల్మాన్ కమిటీ' కన్వీనర్ అహ్మద్ ఖాన్, ప్రముఖ మోటివేటర్ బ్రదర్ సిరాజుల్ రెహ్మాన్, కోకన్వీనర్లు షమీం సుల్తాన, అఖీల్ బేగ్, అబ్దుల్ రహీం, మహ్మద్ అఫ్సర్, మహ్మద్ అక్రం మంగళవారం కలిశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



డోర్నకల్: డోర్నకల్ మండలం గొల్లచర్ల, పెరుమాళ్ల సంకీస ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ సౌకర్యంతో పాటు కేంద్రాల బయట ర్యాంప్‌లు పరిశీలించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నాగభవాని, పీఆర్ డీఈ మహేష్, సీఐ ఉపేందర్‌రావు, ఆర్ఐ రామ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

గంగారం: మండలంలోని గిరిజన బాలికల పాఠశాలను మంగళవారం డీడీ ఎర్రయ్య తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, పాఠశాల ఆవరణను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీ-విజిల్ యాప్‌పై ప్రచారం చేయాలి

మహబూబాబాద్: సీ-విజిల్ యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి డీజీపీ అంజనీకుమార్, ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై జిల్లాల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి జానపద బృంద నృత్య పోటీలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీలోల చదివే 8, 9తరగతుల విద్యార్థులకు ఈనెల 9, 23వ తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఉదయం 10గంటలకు జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు మంగళవారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచిన బృందం రాష్ట్రస్థాయిలో పాల్గొంటుందన్నారు. బృందంలో నాలుగు నుంచి ఆరుగురు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, ఒక పాఠశాల నుంచి ఒక గ్రూప్ మాత్రమే పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు ఫోన్ నంబర్ 98495 98281లో సంప్రదించాలన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

మహబూబాబాద్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (టీఏఎన్ఏ) ఆధ్వర్యంలో వందే విశ్వమాతరం పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ నిర్వహించే శాంతి సద్భావన యాత్రను విజయవంతం చేయాలని వందే విశ్వమాతరం సమన్వయ కర్త, కవి, రచయిత గుర్రపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. శ్రీనివాస్ పలు దేశాలలో యాత్ర నిర్వహిస్తారన్నారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో అపూర్వంగా యాత్ర జరుగుతుందన్నారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం మానవీయ విలువలను పెంపొందించుటకు యాత్ర చేపట్టడం జరుగుతుందని, ఈనెల 9నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ప్రకృతి, రక్షణ పర్యావరణ పరిరక్షణ, విశ్వశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం వంటి మహత్తర లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వెంకటరాణా ప్రతాప్, ఇమ్మడి రాంబాబు, డాక్టర్ పరికిపండ్ల అశోక్, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పెద్దవంగర: కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: మండల కేంద్రానికి చెందిన రెడ్డి సంఘం నాయకులు మంగళవారం పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రానికి చెందిన 2వ వార్డు సభ్యుడు ఎడ్ల సతీష్ రెడ్డి, 5వ వార్డు సభ్యురాలు ముత్యాల భవాని నరేష్‌లతో పాటు 30 రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా వారికి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మెట్టు నగేష్, రవి, ముత్యాల పూర్ణచందర్, సతీష్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం దంటకుంటతండా గ్రామ పంచాయతీ పరిధికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు.

నెల్లికుదురు: మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో సొసైటీ మాజీ చైర్మన్ పానుగోటి రామారావు, సర్పంచ్ బొమ్మెర అశోక్‌తోపాటు 300 మంది బీఆర్ఎస్ నుంచి సొంతగూడైన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు.

శంకర్‌నాయక్‌కు నిరసన సెగ



ముళ్లకంప అడ్డువేసి నిరసన తెలుపుతున్న స్థానికులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు నిసరన సెగ తగిలింది. మంగళవారం ఆయన 25వార్డులో ప్రచారం చేస్తుండగా.. ఆ వార్డు పరిధిలోని జెండాల గల్లీ వాసులు రోడ్డుకు అడ్డుగా ముళ్లకంప వేసి రాకుండా అడ్డుకున్నారు. నాయకులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కంచె తీయలేదు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. కొత్త హామీలు ఇచ్చి మళ్లీ మోసం చేయడానికి వచ్చావా అంటూ నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక శంకర్ నాయక్ అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ ఫరీదా, ఫ్లోర్‌లీడర్ జనార్దన్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్: మండలంలోని పలు ప్రాంతాల్లో డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యం సీసాలు, గుడుంబాను స్వాధీనపర్చుకున్నారు. డోర్నకల్ ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. ఫకీరాతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోడ్యాతండాలో దాడులు నిర్వహించి వందలీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి పదిలీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని భూక్యా సాల్కు అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బూరుగుపాడులోని బెల్టుషాపుపై దాడి చేసి సుమారు రూ.4వేల విలువైన మద్యం సీసాలను స్వాధీనపర్చుకుని రాయబారపు రేణుక అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

దంతాలపల్లి: 20లీటర్ల గుడుంబా, 50లీటర్ల నల్ల బెల్లం స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తూర్పుతండా గ్రామపంచాయతీ రేక్యాతండాలో గుడుంబా, బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఇంట్లో 20 లీటర్ల గుడుంబా, 50 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపాడు. బానోత్ బుజ్జిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

బీజేపీకి యువకులే స్టార్ క్యాంపెయినర్లు



మహబూబాబాద అర్బన్: పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: బీజేపీకి యువకులే స్టార్ క్యాంపెయినర్లుగా నిలుస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన యూత్ జిల్లా నాయకులు నాయిని కృష్ణ మోహన్ బీజేపీలో చేరాడు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్, అసెంబ్లీ కన్వీనర్ సిద్దార్థ రెడ్డి, మండల అధ్యక్షుడు నవీన్‌నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని మచ్చర్లకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 60 మంది మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్‌నాయక్ సమక్షంలో పార్టీలో చేరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశాడని, మరోసారి బీఆర్ఎస్ గెలిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 9,10,22,23,24 వార్డుల్లో ప్రచారం నిర్వహించాడు. దంతాలపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని ఆయన సతీమణి ఉషాదయాకర్‌రావు మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి భారీ వర్షంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీతోనే పేదప్రజల సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని గడ్డిగుడెం తండా, నడివాడ, రెడ్యాల, సికింద్రాబాద్ తండా, కంబాలపల్లి, వేమునూరు, లక్ష్మీపురం(బి), మొట్ల తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. డోర్నకల్ మున్సిపాలిటీ అభివృద్ధిని రెడ్యానాయక్ నిర్వీర్యం చేశాడని డోర్నకల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం రాంచంద్రునాయక్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. అనంతరం చిలుకోడు సర్పంచ్ రాయల వెంకట్‌బాబు కాంగ్రెస్ పార్టీ చేరాడు. పౌరసత్వాన్ని అడ్డుకున్న ప్రత్యర్థులు తమ వారసత్వాన్ని అడ్డుకోలేరని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని యశస్విని రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

బీఎస్పీ..

బీఎస్పీతోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ అభ్యర్థి గుగులోతు పార్వతి అన్నారు. మండలంలోని స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలోని జోగ్యతండాలో బీఎస్పీ మండల మహిళా కన్వీనర్ దారావత్ భారతి ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు.

వెంకన్న పవళింపుసేవ



గార్ల: వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో పడుకోబెట్టి పవళింపుసేవను భక్తులు ఘనంగా నిర్వహించారు. పవళింపుసేవ 3 రోజుల పాటు కొనసాగుతుందని, నేటితో బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ముగిసినట్లు అర్చకులు రామాయణం రామాచార్యులు తెలిపారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమిద్దాం

మహబూబాబాద్ అర్బన్: అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించి అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అమర వీరుల సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు గొడిశాల మనోజ్, రాహుల్, రాంబాబు, సౌజన్య, అఖిల, స్వప్న, స్వర్ణ, నవీన్, మధు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి

కురవి: అమరవీరుల ఆశయాల సాధన కోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయితండాలో హచ్చన్న స్థూపంపై సబ్‌డివిజన్ కార్యదర్శి గుజ్జు దేవేందర్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో లింగన్న, బాబన్న, పాపయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రోజారాణి

గూడూరు: ఓటు హక్కు కల్గిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ రోజారాణి అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై అన్నిశాఖల అధికారులకు, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కుపై ఇతరులకు అవగాహన కల్పించాలని, ప్రలోభాలకు లొంగరాదన్నారు. అదేవిధంగా ఎవరైనా ఓటరును ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేస్తే, సీ విజిల్ యాప్ ద్వారా, లేదా టోల్ ఫ్రీ నంబర్ 1950 కాల్ చేయాలన్నారు. 80ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని, పెద్ద వాళ్లకు తెలియజేయాలన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు



డోర్నకల్: గొల్లచర్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

డోర్నకల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ పోలీసులు మంగళవారం పలుగ్రామాల్లో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన ఉయ్యాలవాడ, గొల్లచర్ల గ్రామాల్లో సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఏపీఎస్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

మహబూబాబాద్ రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండాలని మహబూబాబాద్ టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ సతీష్, ఎస్సైలు విజయ రాంకుమార్, తాహెర్ బాబా, దీపిక రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మద్దతుతోనే విజయం

కురవి: డోర్నకల్ నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధించాలన్నా సేవాలాల్‌సేన మద్దతు తప్పకుండా ఉండాల్సిందేనని, సేవాలాల్ సేన మద్దతు ఉంటేనే విజయం దక్కుతుందని సేవాలాల్ సే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి నిర్ణయం తీసుకుని సంఘం ఎవరికి మద్దతు ఇవ్వాలో చెబుతామన్నారు. కార్యక్రమంలో ధారవత్ మోతిలాల్, గుగులోత్‌నందులాల్, బాదావత్ రాంబాబు, బానోత్ గణేష్, భూక్యా నరేష్, బోడ సుమన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

దొంగతనం కేసులో జైలు

మరిపెడ/దంతాలపలి/నెల్లికుదురు: దొంగతనం కేసులో నేరస్తుడు దోసపాటి వంశీకి తొర్రూర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ సంవత్సరం జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ.. నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన రుద్రారపు సమ్మయ్య ఇంట్లో, మరిపెడ మండల కేంద్రంలోని బాణాల భుజంగరావు ప్లైవుడ్ దుకాణంలో, ఇందుర్తి గోవిందారెడ్డికి చెందిన దుకాణాలలో, దంతాలపల్లిలో పలు ఇళ్లలో చోరీ చేశాడు. నిందితుడు సూర్యాపేట జిల్లా మోతె గ్రామానికి చెందిన దోసపాటి వంశీ దొంగతనం చేసినట్లు కోర్టులో రుజువైనందున జైలుశిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపాడు.

బైండోవర్

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం, కాచికల్ గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న 22మందిని మంగళవారం తహసీల్దార్ రాజు ముందు బైండోవర్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కేసముద్రం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. మంగళవారం ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం స్టేషన్ అంబేడ్కర్ సెంటర్ సమీపంలో విద్యుత్ జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న పరమేశ్వర్ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 3వ తేదీన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం కుటుంబసభ్యులతో కలసి ఖమ్మం వెళ్లారు. కాగా తిరిగి మంగళవారం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రెండు తులాల బంగారం గొలుసు, 12 తులాల వెండి పట్టీలు అపహరించినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపాడు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య

డోర్నకల్: మహబూబాబాద్-గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్సై కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మహబూబాబాద్-గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటరు నంబర్ 437/8-10 వద్ద సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన వృద్ధుడు గూడ్సు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపాడు. మృతుడి సమాచారం తెలిసిన వారు 87126 85600, 94947 90619 నంబర్లకు సంప్రదించాలని ఎస్సై శ్రీకాంత్ కోరారు.

వస్తు సామగ్రి దగ్ధం



డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సామగ్రి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఉప్పనపల్లి సత్యావతి, శ్రీనివాస్ దంపతులకు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఇంట్లో టీవీ, ఫ్రిజ్ లాంటి విలువైన పరికరాలు, వస్తుసామగ్రితోపాటు ఇంటి పైకప్పు మంటలకు దగ్ధమైంది. డోర్నకల్ నుంచి ఫైరింజన్ రాగా సిబ్బంది మంటలను ఆర్పారు. అగ్నిప్రమాదంలో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బీఆర్ఎస్‌కు రాజీనామా

గూడూరు: మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండా సర్పంచ్ బోడ మంగీలాల్‌నాయక్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపాడు. నలుగురు వార్డు సభ్యులు, 200 మంది తండావాసులతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపాడు.

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమకారుడు శాగంటి రాములు, మండల రైతుబంధు సమితి సభ్యుడు ఎరుపుల వెంకన్న, ఆవుల బాబు ఆధ్వర్యంలో 50మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు.

బీజేపీకి..

నెల్లికుదురు: 13ఏళ్లపాటు బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా కష్టపడి పనిచేసిన పార్టీలో తగిన గుర్తింపు దక్కడంలేక బీజేపీకి రాజీనామా చేసినట్లు, మహబూబాబాద్, కామారెడ్డి రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన గుగులోతు వెంకన్ననాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో మోసపోయి గోసపడ్డమని డబ్బున్న వారికి పదవులు కట్టబెట్టడం సిగ్గుచేటన్నారు. దళిత గిరిజనులు బీజేపీకి దూరంగా ఉండాలని కోరారు.

బియ్యం అందజేత

గంగారం: మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బూర్క సక్కుబాయి ఇటీవల మృతిచెందింది. సక్కుబాయి కుటుంబానికి ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే దనసరి సీతక్క ఆదేశాల మేరకు 50కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుంచ వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ యాపభద్రయ్య, నాయకులు జగనం భద్రయ్య, ఈసం సురేష్, దుర్గం లవయ్య, రాజం లక్ష్మీనారాయణ, రామస్వామి, రవి, సునీల్, ఈసం సమ్మయ్య, బూర్క శ్రీను, బీరబోయిన సుగుణ, యాప నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

గార్ల: ఎస్పీ ఆదేశాల మేరకు గార్ల రైల్వేస్టేషన్‌లో మంగళవారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో గార్లబయ్యారం సీఐ బాబూరావు, ఎస్సై వెంకన్న, ఏఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మంగీలాల్ పాల్గొన్నారు.

యువతతోనే మార్పు సాధ్యం

మరిపెడ రూరల్: దేశ రాజకీయాల్లో యువతతోనే పెను మార్పులు చోటుచేసుకుంటాయని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎల్లంపేటలో డీఎస్ రవిచంద్రను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

సైడ్ కాల్వలను నిర్మించాలి

గార్ల: మండలంలోని కోట్యానాయక్‌తండా పంచాయతీలోని ముత్తితండా గ్రామంలో సైడ్ కాల్వలను వెంటనే నిర్మించాలని కోరుతూ టీజేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి.హరినాయక్ మంగళవారం పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశాడు.

బోనస్ డబ్బులు చెల్లించాలి

గంగారం: 2016- 2021 వరకు తునికాకు సేకరించిన కూలీలకు బోనస్ డబ్బులు తక్షణమే చెల్లించాలని కోడిశలమిట్ట గ్రామ ప్రజలు కవిత, లలిత, సుమలత, లావణ్య ఆరోపించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. తక్షణమే కూలీలకు బోనస్ డబ్బులు చెల్లించాలని లేదంటే ఈనెల 30న జరిగే ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రజలంతా ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వారు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లిలో నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన 20 మంది యువకులు రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

శబరిమలకు అద్దె బస్సులు

తొర్రూరు: టీఎస్ ఆర్టీసీ తొర్రూర్ డిపో నుంచి శబరిమల భక్తులకు అద్దె లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తొర్రూరు డిపో మేనేజర్ కె.పరిమళ తెలిపారు. కోరుకున్న ప్రదేశం నుంచి దర్శించుకోవలసిన పుణ్యక్షేత్రాల మీదుగా బస్సు నడుపనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకోసం 99592 26053, 70321 82456, 99891 48206 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళా రోగితో అసభ్య ప్రవర్తన

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ మహిళా పట్ల ఆస్పత్రిలో పని చేసే పేషెంట్ కేర్ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ సదరు మహిళ భర్త, బంధువులు ఉద్యోగి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈవిషయమై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. సంఘటన తన దృష్టికి వచ్చిందని దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జరిగిన సంఘటనపై బాధితురాలి సంబంధికులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వీరన్న సన్నిధిలో రాంచంద్రునాయక్ పూజలు



కురవి: డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్‌కు ఖరారు కావడంతో మంగళవారం మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడి సెంటర్ వద్ద పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గుండ్రాతిమడుగు(విలేజి) ఎంపీటీసీ గుగులోత్ జ్యోతివిస్నానాయక్ బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, అవిరె మోహన్‌రావు, రాజేందర్‌కుమార్, బాలగాని శ్రీనివాస్, కాట్యాల వినయ్, చిన్నం గణేష్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.